www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025 5

పశ్చిమ గోదావరి



22న వీరవాసరంలో జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

డిఇఒ నారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 22న వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు డిఇఒ ఇవిఎస్ఎస్ఎన్‌బిఎల్.నారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో పాఠశాలల నుండి మండల స్థాయికి ఎంపికైన, మండల స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శిస్తారని, జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపికైన ఎగ్జిబిట్స్ ముందు రోజే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో అందరూ ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శించిన వివిధ ఎగ్జిబిట్లను సందర్శించి జయప్రదం చేయాలని కోరారు.

పింఛన్లపై దొంగాట..!

'నిడమర్రు మండలం అడవికొలనుకు చెందిన బొద్దు సూర్యారావు పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యారు. లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలి. ఇప్పటి వరకూ ఇతనికి వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నారే తప్ప.. పక్షవాతం వచ్చిన వారికి ఇచ్చే పింఛన్ ఇవ్వడం లేదు. లేవలేని స్థితిలో ఉన్న సూర్యారావుకు వైద్యులు 75 శాతం అంగవైకల్యం ఉన్నట్లు చూపడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తనకు రూ.15 వేలు పింఛన్ అందించాలని అధికారులు చుట్టూ కుటుంబసభ్యులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు'.

'ఏలూరు కత్తేపువారి వీధికి చెందిన బూరగ మోషే పక్షవాతంతో వెన్నుముక, నరాలు దెబ్బతిన్నాయి. గత ప్రభుత్వంలో పింఛన్ వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపివేసింది. రూ.15 వేలు పింఛన్‌కు అర్హతున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి'.



పక్షవాతంతో బాధపడుతూ రూ.15 వేల పింఛన్ కోసం ఎదురుచూస్తున్న బాధితుడు సూర్యారావు

- జిల్లాకు 200 మాత్రమే కొత్త పింఛన్లట
- ఏలూరు జిల్లాలో 20 వేల మంది, పశ్చిమలో 18 వేల మంది వరకూ ఎదురుచూపు
- పక్షవాతం బారిన పడినవారికి రాని పింఛన్లు
- కొత్త పింఛన్ల మంజూరుకు కూటమి మొండిచెయ్యి
- పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో అత్యధికం పింఛన్లే
- ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న సూర్యారావు, మోషేనే కాదు. జిల్లాలో కొత్త పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల మంజూరు అనేది లేకుండాపోయింది. పింఛన్ అందుకుంటున్న భర్త చనిపోతే భార్యలకు స్పౌజ్ పింఛన్లు మంజూరు తప్పితే, ఎక్కడికీ కొత్త పింఛన్ ఇవ్వలేదు. దీంతో పింఛన్ల కోసం అర్హులంతా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో అత్యధికం రెవెన్యూ, పింఛన్ దరఖాస్తులే ఉంటున్నాయి. దీంతో అధికారులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. అధికారుల అంచనా ప్రకారం ఏలూరు జిల్లాలో 20 వేల మంది, పశ్చిమలో 18 వేల మంది వరకూ కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. పిజిఆర్ఎస్‌లో పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఏలూరు జిల్లాలో నాలుగు వేల వరకూ ఉండగా, పశ్చిమలోనూ అదేస్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన కలెక్టర్ల సమావేశంలో సిఎం వద్ద పింఛన్ల అంశాన్ని అధికారులు ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో జిల్లాకు 200 పింఛన్ల వరకూ కలెక్టర్, ఇన్‌ఛార్జి మంత్రి పరిశీలించి ఇచ్చేలా అనుమతివ్వనున్నట్లు తెలిసింది. వేలల్లో పింఛన్ దరఖాస్తులు పెండింగ్ ఉంటే 200 పింఛన్లు ఇవ్వాలని చెప్పడం ఏమిటో ఎవ్వరికీ అర్థంకాని పరిస్థితి ఉంది. రాజకీయ అనుకూలురకే ఈ పింఛన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యులకు అందే అవకాశం ఏమాత్రం ఉండదు. వచ్చే జూన్ నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతోంది. అయినప్పటికీ కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంఎల్ఎలు నిర్వహించే ప్రజాదర్బార్‌లోనూ పింఛన్లకు సంబంధించిన దరఖాస్తులే అత్యధికం ఉంటున్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు సైతం సమాధానం చెప్పలేని పరిస్థితి. గత ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లను మంజూరు చేసేది. జూన్‌లో ఒకసారి, జనవరిలో మరోసారి కొత్త పింఛన్లు ఇచ్చేవారు. రెండేళ్లుగా ఆ పరిస్థితి లేకపోవడంతో అర్హులైన ఎంతోమంది పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

పక్షవాతం పింఛన్ల సైట్ మూత

పక్షవాతంతో బాధపడే వారు రూ.15 వేలు పింఛన్‌కు అర్హులు. మెడికల్ సర్టిఫికెట్ పొందిన అనంతరం [illegible] డిఎంహెచ్ఒ కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సైట్‌ను మూసేసింది. దీంతో పక్షవాతంతో బాధపడే వారికి కొత్తగా పింఛన్ అందే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే ఈ సైట్ తెరిచి పక్షవాతంతో బాధపడేవారికి పింఛన్ అందించాలని అంతా కోరుతున్నారు.

నేడు జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో

1,87,204 పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాబాయి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నేపథ్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.గీతాబాయి అన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. భీమవరంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో అవగాహనా ర్యాలీని గీతాబాయి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు అందించే కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. జిల్లాలో 5 సంవత్సరాల వయసు గల 1,87,204 పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 1,315 పోలియో బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమ నిర్వహణకు 5,520 మంది ఉద్యోగులకు విధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లో వద్ద కూడా పల్స్ పోలియో శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం రోజు తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించకపోతే 22, 23 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వస్తారని ఆరోజు వేయించాలని తెలిపారు. ఈ ర్యాలీలో అడిషనల్ డిఎంహెచ్ఒ ఎం.రవిబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా లక్ష్మి, డాక్టర్ ఎం.రవిబాబు, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కీర్తి కిరణ్, భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.లక్ష్మణ్ గీతానంద్, డిపిఎం ధనలక్ష్మి, డాక్టర్ క్రాంతికుమార్, యుపిహెచ్‌సి వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, డెమో సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ గీతాబాయి

చెత్త తొలగించాలని వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని కొప్పర్తి వేణుగోపాల్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో అధికారులు చెత్త వేయడాన్ని నిరసిస్తూ శనివారం వ్యాపారులు ధర్నా చేపట్టారు. వ్యాపార సముదాయాన్ని డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదని, దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త వేస్తే ఇక్కడ ఎలా వ్యాపారాలు సాగించాలని ప్రశ్నించారు. ఇదే ప్రాంతం నుంచి పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా జరుగుతోందని, చెత్త వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. తక్షణం చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు.



భీమవరం : డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

ఉపాధి హామీ చట్ట సవరణ తగదు

తక్షణం మార్పులు ఉపసంహరించుకోవాలి - వ్యవసాయ, కౌలు రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిఆర్‌ఒకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరించి పేదల పొట్టకొడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం, మోడీ విధానాలను వ్యతిరేకిస్తూ తక్షణం చట్టసవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతుల సంఘం, రైతుసంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.రామాంజనేయులు, వేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ వలసలను అరికట్టి, పని లేని రోజుల్లో పని కల్పించి ప్రధానంగా వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం సవరణలు చేసి దెబ్బతీయడం దారుణమన్నారు. గాంధీ పేరు తొలగించి అవమానించడంతోపాటు కార్మికులు పని అడిగే హక్కు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టప్రకారం గతంలో వంద రోజులు పని గ్యారంటీతోపాటు పనిలేని కరువు రోజుల్లో పని కల్పించామని, దరఖాస్తు చేసుకుంటే ఎంపిడిఒ 15 రోజుల్లో పని కల్పించాలని, లేకపోతే 40 శాతం కూలీ చెల్లించాలని ఉండేదని అన్నారు. తక్షణమే చట్టసవరణ ఉపసంహరణ చేసేలా జిల్లా ఉన్నతాధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు విన్నపం పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఈ బిల్లును వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జల్లి రామ్మోహన్‌రావు, సిఐటియు సీనియర్ నాయకులు పొగాకు నారాయణరావు, సంఘాల నేతలు గుత్తుల శ్రీరామచంద్రుడు, గుబ్బల నాగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు, బొక్కా శ్రీనివాసరావు, కొల్లాటి పుష్పకుమారి, మానికల అన్నమ్మ పాల్గొన్నారు.

కాళ్ల: గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని, 2025 ఉపాధి హామీ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేసి, సవరణ బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మండల సూరిబాబు, యిర్రింకి ఏడుకొండలు, గండికోట వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



యలమంచిలి మండలంలో..



ఇరగవరం మండలంలో

ఇరగవరం: ఉపాధి హామీ చట్టం పేరు మార్పు మహాత్మాగాంధీని అవమానపర్చడమేనని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. ఉపాధి కూలీల పొట్ట కొట్టడానికి తీసుకొచ్చిన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యర్రాయిచెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలతో కలిసి బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్. వీరభద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు, నేతలు పితాని నాగేశ్వరరావు, జుత్తిగ వెంకటలక్ష్మి, పితాని లక్ష్మి, జుత్తిగ గౌరి, కుడిపూడి ఆనందకుమారి, జుత్తిగ కోమలిదుర్గ పాల్గొన్నారు.

యలమంచిలి: గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలకపాత్ర వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కొత్తగా విబి జీ రామ్ జీ పథకాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం, రైతుసంఘం, సిఐటియు ఆధ్వర్యంలో చించినాడలో శనివారం నిరసన చేపట్టారు. అనంతరం నూతన బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, శెట్టిమి భాస్కరరావు, నామవరపు మోషేన్, చుట్టుగుల్ల సత్యవతి, తెన్నేటి పార్వతి, శెట్టిమి మరియమ్మ పాల్గొన్నారు.

ఉండి: నిరుపేదలకు పూట గడవడమే కష్టమైన ఈ రోజుల్లో వారికి పని కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం అత్యంత దారుణమని సిపిఎం నాయకులు ధనికొండ శ్రీనివాస్ విమర్శించారు. శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, శేషు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వీరవల్లి మాధవరావు, రామకూరి వెంకటరత్నం, పెల్లూరి సుబ్రహ్మణ్యం, నక్కా వెంకటేశ్వర్లు, మోపిదేవి రాము, కొయ్యే యేసుబాబు, రామకూరి కృష్ణ, పిడకాల వెంకటేష్, చాబత్తుల యేసు, పోతుల ఇమ్మానుయేలు, పీడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపవరం: ఉపాధి హామీ ఉసురు తీసే 2025 బిల్లును ఉపసంహరించుకోవాలని మహాత్మాగాంధీ పేరును యధావిధిగా కొనసాగిస్తూ, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కేశవరం సెంటర్‌లో బిల్లు ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నేతలు సోడదాసి సంజీవరావు, నరాలశెట్టి రామకృష్ణ, గుత్తుల శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నరాలశెట్టి చాందిని, కేతా శ్రీనివాస్, ఎం.వెంకటేశ్వరరావు, కట్టా రామకృష్ణ, టి.యోహన్, దొంగ సత్యవతి, జాలే ఏసు, అనిపే లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెనుగొండ: స్థానిక దొంగగూడెం ప్రాంతంలో ఉపాధి హామీ సవరణ బిల్లు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు ఎస్‌కె.పాదుషా మాట్లాడారు. కార్యక్రమంలో పూతినీడి పద్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



నర్సాపురంలో..



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పశ్చిమను స్వచ్ఛ జిల్లాగా నిలిపేందుకు ప్రజలు, యువత భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణంలో అవకాశాలు అనే థీమ్ తో మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో భీమవరం విష్ణు కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్‌తోపాటు కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మితిమీరిన కాలుష్యం కారణంగా సుప్రీంకోర్టు ఢిల్లీని నివాసయోగ్యం కాదని ప్రకటించిందని గుర్తు చేశారు. జిల్లా యంత్రాంగం ఎంత చేసినా, ప్రజల్లో మార్పు వస్తేగాని ఫలితం ఉండదు అన్నారు. నీరు కలుషితం కాకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్నా, అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చెత్త నిర్వహణ సక్రమంగా చేపట్టకపోతే మన జిల్లానే కాదు, ప్రపంచం మొత్తం పెద్ద ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యమన్నారు. తొలుత డిప్యూటీ స్పీకర్, కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాకు కేటాయించిన ఎనిమిది చెత్త సేకరణ ట్రక్ ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన పర్యావరణహిత ఆవిష్కరణలను స్వయంగా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిపిఒ ఎం.రామనాథ్‌రెడ్డి, విష్ణు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, స్వచ్ఛఆంధ్ర మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పి.రోహిత్, మున్సిపాల్టీ సహాయ కమిషనర్ ఎ.రాంబాబు, ఎంహెచ్ఒ ఆర్.సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉలుకు.. పలుకూ లేదాయే..!

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం కలపడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం, ఉపాధి హామీ చట్టంలో పెనుమార్పులు రెండు జిల్లాల్లో తీవ్ర చర్చనీయాంశమవ్వగా.. హేలాపురి, భీమవరం బాలోత్సవాలు ప్రజల్లో ఆసక్తి రేకెత్తించాయి.



పోలవరం జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలై రోజులు గడుస్తుంది. పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకుండా పోవడం ఏమిటని అక్కడి ప్రజలు నాటి నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు సాగిస్తున్నారు. తాజాగా ఈ నెల 22న బంద్‌కు సైతం పోలవరం జిల్లా సాధన కమిటీ పిలుపునిచ్చింది. ప్రధానంగా ఎన్నికల ముందు పోలవరం ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసిత ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాలు కలిపి జిల్లాగా ప్రకటిస్తామని చంద్రబాబే హామీ ఇచ్చారు. ప్రధానంగా నిర్వాసితులంతా ఒక జిల్లా పరిధిలో ఉంటే వారి సమస్యల పరిష్కారంలో ఎటువంటి సమస్యలూ ఉండవని సైతం నాడు ముక్తాయించారు. అయితే జిల్లా ప్రకటనలో మాత్రం రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా అని పెట్టినా, అందులో పోలవరం నియోజకవర్గమే లేకపోవడంపై అంతా కంగుతిన్నారు. తుది గెజిట్ విడుదల చేసేలోపు ప్రభుత్వం మార్పు చేస్తుందా, లేక నోటిఫికేషన్‌కే పరిమితమవుతుందా అనే చర్చ సర్వత్రా సాగుతుంది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు ఇప్పటికే జిల్లా సాధన కమిటీగా ఏర్పడి ఆందోళన చేస్తున్నాయి. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఈ అంశాన్ని పవన్‌కళ్యాణ్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పడం మినహా మిగిలిన ప్రజాప్రతినిధులెవ్వరూ దీనిపై నోరుమెదపకపోవడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలోనే ఈ నెల 22న మన్యం బంద్ విజయవంతానికి విస్తృత ప్రచారం చేశారు. ఈ బంద్ పట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.

ఉపాధి హామీ చట్టంలో మార్పులపై రెండు జిల్లాల్లో ఉపాధి కూలీలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరు మార్పుకన్నా ఆ చట్టంలో నిబంధనలు సమూలంగా మార్చడం తమ పొట్ట కొట్టడమేనని భగ్గుమంటున్నారు. ప్రధానంగా ఇప్పటికే కేంద్రం బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కేటాయింపు తగ్గిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే పనులు చేసిన తర్వాత నెలలు తరబడి సొమ్ము కోసం వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే వేతనం వస్తుందనే ధీమాతో ఉన్నదాంతో సరిపెట్టుకోవడం, లేక అప్పు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తాజాగా కేంద్రం నిధుల వాటా 90 నుంచి 60 శాతానికి తగ్గించి, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలనడం కచ్చితంగా ఉపాధి హామీ ఊపిరి తీసినట్లేనని అంతా అభిప్రాయపడుతున్నారు. ఇక వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు పనులు ఆపాలనే నిబంధన సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా ఇప్పటికే వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం, యాంత్రీకరణ వల్ల పనులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో ఉపాధి హామీకి నిధులు పెంచాల్సిందిపోయి తగ్గించడం, కేంద్రం వాటా తగ్గించడం పేదల సంక్షేమం పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో స్పష్టమవుతోంది.

రెండు జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన బాలోత్సవాలు విజయవంతమయ్యాయి. భీమవరం బాలోత్సవానికి కలెక్టర్, ఎస్‌పి, ఇతర ప్రముఖులు హాజరవ్వడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రధానంగా కలెక్టర్ కొద్దిసేపు బాలలతో గడపడం అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుత యాంత్రిక పని విధానంలో ఎవరికైనా మానసికోల్లాసం అత్యంత అవసరం. అదీ బాలలకైతే మరింత అవసరం. వారి ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసేలా, ప్రతిభను ప్రోత్సహించేలా ఇటువంటి బాలోత్సవాలు మరిన్ని నిర్వహించాలని విచ్చేసిన వక్తలు, ప్రముఖులు ముక్తాయించడమే దీనికి నిదర్శనం. ఇదే క్రమంలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు బాలోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలిరావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రస్తుతం కొన్ని పట్టణాలకే పరిమితమైన ఈ బాలోత్సవాలను రెండు జిల్లాల్లో మరిన్ని కేంద్రాలకు విస్తరించాలని, బాలల మనోవికాసానికి, ప్రతిభ ప్రోత్సాహనికి వేదిక కావాలని ఆశిద్దాం.

- వివిఎస్‌వి.ప్రసాద్

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - తణుకు

కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలూ పరిష్కారం కావాలంటే పోరాటం ఒక్కటే మార్గమని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక నరేంద్ర సెంటర్లో సిఐటియు అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బెలూన్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ దేశంలో కార్మికుల పక్షాన 1970 నుండి నేటి వరకూ సిఐటియు ఉద్యమిస్తోందన్నారు. శ్రమను, కార్మికులను గౌరవించే సమాజం కోసం సిఐటియు కృషి చేస్తోందన్నారు. నేడు అధికారంలో ఉన్న పాలకులు కార్మికులు సృష్టిస్తున్న సంపదపై పెత్తనం చేస్తూ, కార్మికులకు హక్కులు, కనీసం వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. కార్మికులపై నిర్బంధాలు ఇప్పటికైనా ఆపి వారి సమస్యలపై చర్చించి పరిష్కారం చేయాలని ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, అడ్డగర్ల అజయకుమారి, కామన మునిస్వామి, ఎన్.ఆదినారాయణ బాబు, కేశవరావు, రామకృష్ణ, మందులయ్య, రాంబాబు, ఆదిలక్ష్మి, జి.శ్రీను, ఎన్.తాతయ్య, వెంకటేశ్వరరావు, పి.జ్యోతిబాబు, ఎస్.శ్రీను, ఎం.ఏడుకొండలు, కె.రాణి, కె.సత్యనారాయణ, కె.అయ్యప్ప, డి.గంగాధర్ పాల్గొన్నారు.



తణుకు : బెలూన్లు ఎగురవేస్తున్న నేతలు

యలమంచిలి : ఈ నెల 31 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరగనున్న ఆలిండియా సిఐటియు మహాసభను జయప్రదం కోసం శనివారం సిఐటియు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు కుంచనపల్లి శ్రీవర్ధిని, దేవ సుధాకర్ మాట్లాడుతూ మహాసభల జయప్రదానికి ప్రజలంతా ఆర్థిక సాయం అందించి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత, సుమతి ,రోజా, రూతమ్మ పాల్గొన్నారు.

బాధితునికి వసుధ ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - పోడూరు

కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన సింగ్ అవాజ్ బిహరీ (65) మెదడులో కణతులు ఉండడంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు స్పందించి అతని వైద్యం కోసం వసుధ ఫౌండేషన్ నుంచి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొమ్ముచిక్కాలలో గ్రామ ప్రముఖులు, మాజీ సర్పంచి గుంటూరి వెంకట సత్యనారాయణ రాజు (చంటి రాజు) చేతుల మీదుగా శనివారం ఆవాజ్ బిహరీ కుమార్తెకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చంటి రాజు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ద్వారా చైర్మన్ మంతెన వెంకటరామరాజు రోగులకు నిరంతరం ఆర్థికసాయం అందించి కొమ్ముచిక్కాలకు మహోన్నతమైన సేవలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈసందర్భంగా ఆవాజ్ బిహరీ కుమార్తె రేణుక కుమారి, కుటుంబ సభ్యులు నాగరాజు శ్రీనివాసరాజు(శివ) వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నరసాపురం:యువత డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నరసాపురం ఎక్సైజ్ సిఐ ఎస్.రాంబాబు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ జానకి జూనియర్ కాలేజీలో మత్తు పదార్థాల వినియోగం వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై ఎక్సైజ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, ఇతర మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతోందన్నారు. కాలేజీ, బయట మత్తు పదార్థాల విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు షేక్ ఖాసీం, ఎండీ జైనులాబిద్దీన్, రైటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి చెరువు పరిశీలన

ఉండి:మహదేవపట్నం గ్రామ పంచాయతీ తాగునీటి చెరువును శనివారం ఎంపిడిఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహదేవపట్నం గ్రామంలో తాగునీటి చెరువును తవ్వించి దశాబ్దం కాలం గడవడంతో పబ్లిక్ కుళాయిల ద్వారా వచ్చే నీరు దుర్వాసన వస్తోందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారని తెలిపారు. ఈ మేరకు పంచాయతీ చెరువును పూర్తిగా ఆరబెట్టి ప్రక్షాళన చేయించాలని అధికారులను ఆదేశించారని, తద్వారా 15 రోజుల క్రితం చెరువులోని నీటిని బయటకు తీసి చెరువును ఆరబెట్టడం జరిగిందని తెలిపారు. చెరువును పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయించి త్వరలోనే గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయన వెంట మహదేవపట్నం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి జెవిటి నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం:వికలాంగులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎస్వీఆర్ సర్కిల్‌లో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు విభిన్న ప్రతిభ, నైపుణ్యాలు కలిగి ఉంటారని, అందుకు అనుగుణంగా సహకారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేసే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నందూరి సురేష్, తాడేపల్లిగూడెం పట్టణ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్టాప్‌ల్లో ఆర్టిసి బస్సులు ఆపాలి

ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రోహిత్

ఉండి:ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద బస్సు స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టిసి బస్సు డ్రైవర్లు ఆపకుండా వెళ్లిపోతున్నారని, విద్యార్థులంటే అంత చులకన భావం ఎందుకని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.రోహిత్ ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉండి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో చదివే విద్యార్థులు 60 మందికి బస్‌పాస్ ఉన్నప్పటికీ బస్సులు ఆపడం లేదని తెలిపారు. కొంతమంది విద్యార్థులు స్టాప్ ఉండగా ఎందుకు బస్సులు ఆపడం లేదని డ్రైవర్‌ను అడిగినా స్త్రీ శక్తి పథకం వల్ల బస్సులు ఫుల్ అవుతున్నాయని, దీనివల్ల బస్సులు ఖాళీ లేక ఆపడం లేదని డ్రైవర్లు చెబుతున్నారని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచి విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రోహిత్ ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆర్టిసి భీమవరం డిపో సిఐ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పార్టీలకు అతీతంగా సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజు తెలిపారు. ఉండి నియోజకవర్గ పరిధిలోని 41 మంది లబ్ధిదారులకు రూ.34,60,230 సిఎంఆర్ఎఫ్ చెక్కులను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకట రత్నప్రసాద్, కలువపూడి సొసైటీ అధ్యక్షులు మంతెన దిన నరసింహరాజు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇంట్లోకి చొరబడి ఓ యువతిని లైంగికంగా వేధించిన ఘటనలో నేరం రుజువు కావడంతో ఆ యువకుడికి కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరట్లకట్టలో 2022 జూన్ 16న యువతి ఇంట్లోకి చొరబడి అదే గ్రామానికి చెందిన యువకుడు మామిడి శెట్టి రమేష్‌బాబు ఆమెను లైంగిక వేధింపులకు గురిచేయడంతో నేరం రుజువు కావడంతో అతనికి 10 సంవత్సరాల కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువతి తండ్రి 2వ వివాహం చేసుకోవడంతో అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటోంది. ఆ రోజు ఆమె పడుకుని ఉండగా రమేష్ ఇంట్లోకి చొరబడి ఆమెను లైంగికంగా వేధించాడు. ఆమె కేకలు వేయడంతో రమేష్ పారిపోయాడు. దీనిపై అప్పట్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఎల్‌బి.చర్ల పిహెచ్‌సి డాక్టర్ ఎం.మాధురి సూచించారు. ఆమె పోలియో కార్యక్రమ సన్నాహాలపై శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రి పరిధిలోని 13 గ్రామాల్లో ఐదేళ్లలోపు పిల్లలు 4,323 మంది ఉన్నారని వీరందరికీ పోలియో చుక్కలు వేసేలా 32 కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటలు వరకూ 134 సిబ్బందితో పోలియో చుక్కలు వేస్తామన్నారు. మిగిలిన వారికి 22, 23 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేస్తారని తెలిపారు. 5000 డోసులు సిద్ధంగా ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తల్లిదండ్రులకు పోలియోపై అవగాహన కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మొగల్తూరు : పల్స్ పోలియో ఆదివారం విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని మొగల్తూరు పిహెచ్‌సి వైద్యాధికారి కె.లక్ష్మీపార్వతి తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 5,469 మంది చిన్నారులకు 52 పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ బూత్, ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. 208 మంది సిబ్బందితో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు.

23న వాసవి జిఎంఆర్ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం:రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈనెల 23న వాసవీ జిఎంఆర్ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి పి.లోకమాన్, కళాశాల సెక్రటరీ ఎండీ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఎల్ఐసి ఇన్సూరెన్స్, పేటియం కియో మోటర్స్, టాటా ఎలక్ట్రానిక్స్ మొదలైన కంపెనీలో ఫీల్డ్ అసిస్టెంట్, సేల్స్ మేనేజర్, సేల్స్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ అడ్వైజర్ ఆపరేటర్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుండి 35 సంవత్సరాల వయసు గలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

దాళ్వాకు సాగునీరందిస్తాం

ప్రజాశక్తి - నరసాపురం

దాళ్వాకు నీటి ఇబ్బందులు లేకుండా పుష్కలంగా సాగునీరందిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం నరసాపురం పట్టణ కాలువలో జరుగుతున్న తూడు తొలగింపు పనులను ఆయన నీటి సంఘం, సొసైటీ అధ్యక్షులు, రైతులతో కలిసి పరిశీలించారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని లాకుల వరకూ ఉన్న కాల్వను శుభ్రం చేసి శివారు ప్రాంత భూములకు సాగునీరందిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని 12 వార్డు టిడిపి నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సంకు భాస్కర్, ఆకిడి వీర రమేష్, శ్రీనివాస్, రమణ, బుజ్జి గణేష్, లింగరాజు పాల్గొన్నారు.

కుక్కల స్వైర విహారం

స్థానికులు బెంబేలు

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుక్కల నిర్మూలన చేపట్టడం నేరం అనే నిబంధన ఉండడంతో గ్రామాల్లో ప్రతి సందులోనూ వీధి కుక్కల పెరిగిపోయాయి. దీంతో రోడ్లపై తిరగడానికి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా వీధి కుక్కలను ఒక నిర్దేశిత ప్రాంతంలో బంధించాలని ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రుల ప్రాంతంతో ప్రధాన కూడళ్లలో వీధి కుక్కల సంచారం లేకుండా చూడాలని ఆదేశించింది. అయినప్పటికీ గ్రామ పంచాయతీల పరిధిలో వీధి కుక్కల బెడద తగ్గడం లేదు. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, ముత్యాలపల్లి పేరుపాలెం తదితర గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మొగల్తూరులోని గాంధీబొమ్మ సెంటర్, కూరగాయల మార్కెట్, హైస్కూల్ వీధి తదితరచోట్ల రహదారిపై పదుల సంఖ్యలో కుక్కలు తిరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కుక్కల నిర్మూలనకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో రహదారిపై తిరుగుతున్న కుక్కలు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : ఎంపిడిఓ

ప్రజాశక్తి - ఉండి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపిడిఓ ఎంవివిఎస్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మహదేవ పట్నం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి జెవిటి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం చిన్నారులతో ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేయించి ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ సిఎస్‌వి రెడ్డి మాట్లాడుతూ చెత్తా చెదారాన్ని పంచాయతీ చెత్త సేకరణ వాహనానికి అందించాలని సూచించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ లేకుండా ఉంచుకోవాలని లేనిపక్షంలో దోమలు చేరి వైరల్ జ్వరాల బారిన పడతారన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు, గ్రామాభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఓ శ్రీనివాస్

ఇరగవరం : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు కంతేరులో శనివారం కూటమి నాయకులు నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని అన్ని వీధులనూ శుభ్రపర్చి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించారు. గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్, సిఆర్‌పిలతో శుభ్రం చేశారు. కూటమి నాయకులతో పాటు ఎంపిడిఓ ఎ.శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాలువలు స్వచ్ఛంగా ఉండాలని, ప్రతి పౌరుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు, నియోజకవర్గ ప్రజలు కాలువలను శుభ్రంగా ఉంచిన నాడే స్వచ్ఛ దివస్ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు.

సిపిఎం నేత సత్యనారాయణ మృతి

ఆచంట:పెనుమంచిలి గ్రామానికి చెందిన సిపిఎం శాఖ మాజీ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ (75) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. కుమార్తెల్లో ఇద్దరు గతంలో అనారోగ్యంతో మృతి చెందారు. ముందుగా ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. శనివారం ఉదయం వశిష్ఠ గోదావరి కోడేరు వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. పెనుమంచిలి సిపిఎం శాఖా కార్యదర్శి సిర్రా నరసింహమూర్తి, నాయకులు తలుపురీరి బుల్లబ్బాయి, బండి రంగారావు, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, పిచ్చెట్టి సత్యనారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

సూపర్ స్టార్ కృష్ణను అవమానిస్తారా

భగ్గుమన్న సినీ అభిమాన సంఘాల నాయకులు

భీమవరం టౌన్:సూపర్ స్టార్, దివంగత నటుడు ఘట్టమనేని కృష్ణ విగ్రహాన్ని తొలగించాలని ప్రభుత్వ అధికారులు నోటీసులు ఇవ్వడంతో పట్టణంలోని సినీ అభిమాన సంఘాలు భగ్గుమన్నాయి. శనివారం కృష్ణ విగ్రహం ఉన్న ఎడ్వర్డ్ ట్యాంకు వద్ద అభిమాన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కృష్ణ అభిమాన సంఘం నాయకుడు, మాజీ కౌన్సిలర్ రాయప్రోలు శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ కృష్ణ గౌరవాన్ని పెంచడానికి, ఆయనను గుర్తించుకోవడానికి ప్రభుత్వం వద్ద అన్ని అనుమతులు తీసుకుని భీమవరంలో కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైసిపి హయాంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయి కమిటీ అనుమతులు ఇచ్చిన తర్వాత రూ.16 లక్షలు వెచ్చించి పక్కనే ఉన్న పార్కుకు ఆకర్షణీయంగా కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ అధికారులు 24 గంటల్లోగా కృష్ణ విగ్రహాన్ని తొలగించాలని తమకు నోటీసులిచ్చారన్నారు. ఉన్నత పురస్కారం పొందిన నటశేఖర కృష్ణను ఈ విధంగా అవమానిస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు కొనసాగిస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పెచ్చెట్టి ప్రసాద్, గొల్లవాని తిప్ప ఎంపిటిసి టి.రాంబాబు, మాజీ కౌన్సిలర్ చిగురుపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

తణుకు:యువత గంజాయి డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తణుకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి సూచించారు. శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి డ్రగ్స్ రహిత తణుకు లక్ష్యంగా ప్రగతి డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మణికంఠ రెడ్డి మాట్లాడుతూ గంజాయి ఇతర మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం, మానసిక స్థితిపై చెడు ప్రభావాలు కలుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలలో పిల్లలకు పరిశుభ్రత అలవాట్లు నేర్పించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ముస్తాబు కార్యక్రమాన్ని శనివారం చినఅమిరం జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెసి రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ప్రతి తరగతి గదికీ వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. క్లాస్ రూములు పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ప్రతి విద్యార్థీ పరిశుభ్రత పాటించలన్నారు. ఇంటి వద్ద బయలుదేరినప్పుడు నీటిగా తయారై స్కూల్‌కు రావాలన్నారు. శుభ్రమైన యూనిఫామ్, పాదరక్షలు వేసుకుని రావాలన్నారు. ప్రతి విద్యార్థీ తల, చేతులు, వేసుకున్న దుస్తులు శుభ్రముగా ఉన్నాయా, లేవా అని పాఠశాలకు వచ్చి పరిశీలించుకోవాలన్నారు. ప్రతి క్లాస్ రూమ్‌కూ ఇద్దరు లీడర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, సిఎంఒ వై.చంద్రశేఖర్, ఎంఇఒ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోయజ్ సిల్వర్ జ్యూయలరీ షోరూం ప్రారంభం

సందడి చేసిన సినీనటి నేహా శెట్టి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తనకు వడ్డాణం అంటే ఎంతో ఇష్టమని, ఇక్కడ వడ్డాణం కలెక్షన్స్ చూస్తుంటే అన్ని తీసేసుకోవాలని ఉందని సినీనటి నేహా శెట్టి అన్నారు. భీమవరం జెపి రోడ్డులో గోయజ్ సిల్వర్ జ్యూయలరీ షోరూంను శనివారం సినీనటి నేహాశెట్టి ప్రారంభించారు. గోయాజ్ సిల్వర్ జ్యూయలరీ షోరూంను ఇప్పటి వరకూ 20వ షోరూములున్నా 3వ స్టోర్ తాను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులో 19 స్టోర్లతో విస్తరించి భీమవరంలో 20వ స్టోర్‌గా ప్రారంభమైందన్నారు. యువతులు అందంగా కనిపించేందుకు ఈ జ్యూయలరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ షోరూంలో మంచి సిల్వర్ కలెక్షన్లు ఉన్నాయని తెలిపారు. నిర్వాహకులు రవితేజ వేములూరి, ప్రియాంక వేములూరి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందిన ఏకైక సిల్వర్ జ్యూయలరీ స్టోర్ గోయాజ్ అని, వెండి ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నేడు ఆచంటలో మంత్రి రామనారాయణరెడ్డి పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ఈ నెల 21వ తేదీ ఆదివారం ఆచంటలో పర్యటించనున్నారు. ఈ మేరకు శనివారం జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 7 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 9:30 గంటలకు ఆచంట చేరుకుంటారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొనున్నారు. పోడూరు మండలం కవిటంలో శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన, జగన్నాథపురంలోని రామేశ్వరస్వామి దేవాలయం, ఆచంటలోని ముత్యాలమ్మ దేవాలయం, పెనుగొండ మండలం సిద్ధాంతంలోని కేథారేశ్వర స్వామి దేవాలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. తిరిగి సాయంత్రం 4 గంటలకు ఆచంట నుండి బయలుదేరి తాడేపల్లి వెళ్తారని తెలిపారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చిన మామిడి మున్సిపల్ హైస్కూల్లో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ డి.జితేంద్ర ఫణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని బంగారు జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్య ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు దాటకుండా వివాహం చేయడం చట్టరీత్యానేరమన్నారు. లీగల్ సర్వీసెస్ సభ్యులు చల్లా దానయ్యనాయుడు, ప్యానెల్ లాయర్ ధనాల చాముండేశ్వరి మాట్లాడారు. ఏదైనా సమస్య వచ్చినా, ఎవరైనా ఇబ్బంది కలిగించినా విద్యార్థులు ముందుగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. అవసరమైతే టోల్‌ఫ్రీ నంబర్ 15100, 1098కి ఫోన్ ద్వారా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిఎల్‌వి.విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మానవ అక్రమ రవాణాపై అవగాహనా కార్యక్రమం ఎంపిడిఓ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపిడిఓ వాణి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహనా కలిగి ఉండాలని, ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ 29 సంవత్సరాలుగా పద్మ డాక్టర్. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు 30,500 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ మిథాలీరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

10 విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - పోడూరు

పెనుమదంలోని జెడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు 52 మంది విద్యార్థులకు యుటిఎఫ్ ప్రతిష్టాత్మకంగా ప్రచురించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, సబిత ఉమెన్స్ కాలేజీ వారు సంయుక్తంగా శనివారం బహూకరించారు. దాతలు రెండు సంవత్సరాల నుండి తమ విద్యార్థులకు సంస్థ తరపున యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్ బహూకరించడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల హెచ్ఎం కె.రామ్మోహనరావు తెలిపారు. సబిత కాలేజీ డైరెక్టర్ మద్దాల వాసు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడారు. యునైటెడ్ కాపు సేవా సమితి అధ్యక్షులు కానూరి నాగ వెంకట ప్రభాకరరావు, కార్యదర్శి వీరాస్వామి, కోశాధికారి గుండుమోగుల వీరాస్వామి, కోశాధికారి కొండ్రెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సుకు దర్పణం సృజన

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల్లో వినూత్న ప్రతిభకు వేదికగా సైన్స్ లెర్నింగ్ కార్నివల్ (ఎస్ఎల్‌సి) నిలుస్తుందని, పిల్లల్లోని అపారమైన మేధస్సుకు దర్పణం వారి సృజన అని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకూ మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో స్థానిక వెలగలేరు విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ లెర్నింగ్ కార్నివల్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులందరూ ఒక్కటిగా కలిసి, తమ సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నూతన ఆవిష్కరణలతో రూపొందించిన 400కు పైగా వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా రూపొందించబడ్డాయని నిర్వాహకులు పడాల వెంకటరెడ్డి, సుధారాణి తెలిపారు. పెనుగొండ సిఐ రాయుడు విజయ్‌కుమార్, ఆచంట ఎస్ఐ వెంకటరమణ, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పేరుపాలెం తీరంలో తాబేలు కళేబరం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం తీరంలో తాబేలు కళేబరం లభ్యమైంది. అటవీ శాఖ రేంజ్ అధికారి ఎం.కరుణాకర్ పర్యవేక్షణలో వెటర్నరీ అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఇంజేటి సురేంద్ర పరీక్షలు నిర్వహించారు. 92 సెంటీమీటర్ పొడవున్న ఆడ తాబేలు వయసు సుమారు 12 సంవత్సరాల పైబడి ఉన్నట్లు నిర్ధారించారు. తాబేలుకు కాలుకు, తోక భాగానికి బలమైన గాయమైనట్లు కరుణాకర్ తెలిపారు. పరీక్షలు పూర్తిచేసి నామూనాలు సేకరించిన అనంతరం కళేబరాన్ని తీరంలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రాంప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ ఎస్.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

22న ఉపాధి హామీ చట్ట సవరణ వ్యతిరేకిస్తూ

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధి హామీ చట్టాన్ని పీక నొక్కి, మహాత్మా గాంధీ పేరు మార్చి పేదల హక్కులను కాలరాసే 2025 ఉపాధి హామీ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల 22న భీమవరం సుందరయ్య భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో అనేక పోరాటాల ఫలితంగా 2005 నుంచి అమల్లోకి వచ్చి గ్రామీణ ప్రాంత పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం పేరును కేంద్రంలో మోడీ ప్రభుత్వం తొలగించి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్)గా మార్చారని తెలిపారు. చట్టంలో పేదలకు ఉపయోగపడే అంశాలను సవరించి కొత్త బిల్లును పార్లమెంటులో రాజ్యసభలో మోడీ మంద బలంతో ప్రతిపక్షాల మాట పెడచెవిని పెట్టి ఆమోదింపజేశారని విమర్శించారు. కొత్తగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి. రామ్ జి వల్ల గ్రామీణ పేదలకు జరిగే మంచి చెడులపై చర్చించి రానున్న రోజుల్లో దీనికి వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాల కార్యాచరణ రూపొందించుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ భావించిందని తెలిపారు. ఈనెల 22వ తేదీ సోమవారం భీమవరం మెంటేవారి తోటలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉదయం 10 గంటలకు ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పేదల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న సంస్థలు, దళిత, సామాజిక సంఘాలు, అభ్యుదయ వాదులందరూ పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని గోపాలన్ విజ్ఞప్తి చేశారు.

ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టాలి

కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

జెసికి సంఘం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. రైతుసేవా కేంద్రాల్లో ప్రభుత్వ విధించిన నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో ధాన్యం కొనుగోలు సమస్యలపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. దాదాపు 50 శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎదురవుతున్న సమస్యలపై సంఘం ఆధ్వర్యాన పలు మండలాల్లో పర్యటించి పరిశీలించామన్నారు. ధాన్యం తూసే సమయంలో తూకాల్లో మోసాలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయని తెలిపారు. పలు గ్రామాల్లో ధాన్యం పట్టుబడి 40 కిలోల 600 గ్రాములకుగాను 41 కిలోల 200 గ్రాములు పడుతున్నారని, సంచి బరువు ఎక్కడ తూచినా 500 గ్రాముల లోపే వస్తుందని తెలిపారు. వాహనం పెట్టే మధ్యవర్తులు 41 కేజీల 200 గ్రామాలు పట్టాల్సిందేనంటున్నారని, లేకపోతే మిల్లర్లు ధాన్యం దింపుకోరని అంటున్నారని వాపోతున్నారన్నారు. దీనిపై తక్షణం సంబంధిత అధికారులతో మాట్లాడి మోసాలు అరికట్టాలని కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తూకాల్లో మోసాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.